క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు



తెర్లాం అంగన్‌వాడీ కేంద్రం- 5లో రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ

తెర్లాం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలు- 2,3,5లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ప్రీస్కూల్ పిల్లలు, కార్యకర్తలు, హెల్పర్‌ల హాజరు, ఇతర రికార్డులు, కేంద్రాల పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలంతా సమయ పాలన పాటించాలని, ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించాలన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.

రాజాం ఎస్‌టీఓగా రమేష్



ఎస్‌టీఓ రమేష్

రాజాం: రాజాం సబ్ ట్రెజరీ ఎస్‌టీఓగా ఐ.రమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో విజయనగరం జిల్లా కార్యాలయం నుంచి ఈయన ఇక్కడికి రాగా, ఇది వరకు ఇక్కడ పనిచేసిన జోగారావు అనకాపల్లి సబ్ ట్రెజరీకి బదిలీపై వెళ్లారు.

విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న కోచ్ రామాంజనేయులు, యువకులు

రాజాం: శ్రీకాకుళం జిల్లా పొందూరులో ఈనెల 16న జరిగిన జిల్లా స్థాయి పురుషుల బెంచ్ ప్రెస్ బాడీ బిల్డింగ్ పోటీల్లో రాజాం బాడీ బిల్డర్లు తమ సత్తా చాటారు. రాజాంకు చెందిన డేవిడ్ 74 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలవగా, 66 కిలోల విభాగంలో రౌతు మణి తృతీయ స్థానంలో నిలిచాడు. వీరికి రాజాం పట్టణంలో రామాంజనేయ పవర్ జిమ్‌కు చెందిన కోచ్ చంద్రశేఖర్ మంగళవారం అభినందించి, జ్ఞాపికలు అందజేశారు.

మెంటాడ తహసీల్దార్‌గా అరుణకుమారి



తహసీల్దార్ అరుణకుమారిని మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

మెంటాడ: మండల తహసీల్దార్‌గా ఎం.అరుణకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఎల్.కోట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈమెకు స్థానిక రెవెన్యూ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. తహసీల్దార్‌ను ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు, నాయకులు కనిమెరక త్రినాథ్, రత్నాకర్ నాయుడు, అచ్యుతరావు,మీసాలపేట సర్పంచ్ రామునాయుడు, మెంటాడ నాయకులు లింగేశ్వరరావు మాస్టారు, సిరిసెట్టి నారాయణరావు పాల్గొన్నారు.

మాదిగ మహామేళాను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

బొబ్బిలిరూరల్: మాదిగ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న ఒంగోలు మున్సిపల్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మాదిగ మహామేళాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ సురగాల లక్ష్మణరావు కోరారు.స్థానిక మండలపరిషత్‌కార్యాలయ ఆవరణలో మంగళవారం మాదిగ మహా మేళా కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమానికి మాదిగ,ఉపకులాలు, ఐక్యసంఘాలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో- ఆర్డినేటర్ పెంకి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు స్కూల్ కిట్లు అందజేస్తున్న సత్యనారాయణ

బొబ్బిలిరూరల్: మండలంలోని జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన స్కూల్ బ్యాగులు, తదితర సామగ్రిని సర్పంచ్ ప్రతినిధి బొద్దల సత్యనారాయణ మంగళవారం పంపిణీ చేశారు.ఎంపీటీసీ రౌతు తిరుపతిరావు,పంచాయతీ కార్యదర్శి రవి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలువలు ఇలా.. సాగునీరు పారేదెలా..?



తెర్లాం: తోటపల్లి ప్రధాన కుడికాలువ నుంచి ఆమిటి మీదుగా ఉన్న పిల్లకాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

బొబ్బిలి, తెర్లాం మండలాల్లోని సాగునీటి కాలువలు పూడిక, తుప్పలు, డొంకలతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వరి నారు మడులు తయారు చేసుకునేందుకు సిద్ధమవు తున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు ఇంకా కాలువల్లో పూడిక, తుప్పల తొలగింపుల పనులను ప్రారంభించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తెర్లాం మంగళి గెడ్డ కాలువతో పాటు ఆమండలంలోని తోటపల్లి ప్రధాన కుడి కాలువ నుంచి వివిధ గ్రామాలకు ఉన్న పిల్ల కాలువలు స్వరూపాన్ని కోల్పోయాయి. తెర్లాంలోని తోటపల్లి



బొబ్బిలి రూరల్: గోపాలరాయుడుపేట వద్ద వీఆర్‌ఎస్ ప్రధాన కాలువలో ఏపుగా పెరిగిన తుప్పలు

ప్రధాన కుడికాలువ నుంచి రాజయ్య పేట, ఆమిటి, నందిగాం, నెమలాం, సుందరాడ, రేజేరు, ఉద్దవోలు వద్ద పిల్లకాలువలు ఉన్నాయి. ఈ కాలువల ద్వారా పలు గ్రామాల్లోని వందలాది ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. అయితే పిల్లకాలువల్లో పూడికలు తొలగించకపోవడం, మరమ్మతులు చేయకపోవడంతో ఖరీఫ్ పంటలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందుతుందన్న నమ్మకం రైతుల్లో కనిపించడం లేదు. బొబ్బిలి మండలంలోని సుమారు ఏడు వేల ఎకరాలకు సాగునీరందించే వెంగళరాయసాగర్(వీఆర్‌ఎస్) జలాశయానికి సంబంధించిన ప్రధాన, పిల్ల కాలువలు పూడిక, తుప్పలు, పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తున్నాయి. గోపాలరాయుడిపేట, కింతలివానిపేట, లింగంవలస, సీతయ్యపేట తదితర గ్రామాల రైతులు వీఆర్‌ఎస్ జలాశయం నుంచి వచ్చే సాగునీటి ఆధారంగానే వరి సాగు చేస్తుంటారు. తన సొంత నిధులతో కాలువల్లో పూడికతీత పను లు చేయిస్తానని ఎమ్మెల్యేగా గెలిచిన కొత్తలో బేబీ నాయన రైతులకు హామీ ఇచ్చారు. కానీ నేటికీ ఆహామీ నెరవేరలేదు. మరో వైపు కాలువల్లో పూడికల తొలగింపులు, మరమ్మతులకు రూ.50 లక్షలు నిధు లు మంజూరయ్యాయని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారే కానీ పనులు ప్రారంభించడం లేదు. ఉపాధి హామీ పనుల్లో భాగంగానైనా అధికారులు కాలువలను బాగు చేయిస్తారేమోనని ఆశగా ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగులుతోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి త్వరితగతిన కాలువల్లో పూడిక, తుప్ప లు తొలగించి బాగుచేయాలని రైతులు కోరుతున్నారు.

– తెర్లాం/బొబ్బిలి రూరల్



తెర్లాం: నందబలగ వద్ద స్వరూపం కోల్పోయిన తోటపల్లి పిల్ల కాలువ



తెర్లాం: అధ్వానంగా ఉన్న తెర్లాం మంగళి గెడ్డ కాలువ



బొబ్బిలి రూరల్: సీతయ్యపేట గ్రామం వద్ద వీఆర్‌ఎస్ పిల్ల కాలువ దుస్థితి

అంబేడ్కర్ పుస్తక ప్రదర్శన ప్రారంభం



పుస్తక పఠనంలో సోరు సాంబయ్య

బొబ్బిలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన సుమారు వంద పుస్తకాల ప్రదర్శనను పట్టణంలో ప్రారంభించారు. అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో స్థానిక సంఘం వీధిలో మంగళవారం ప్రారంభించిన ఈ ప్రదర్శనలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు తిలకించేందుకు పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఈసందర్భంగా సోరు సాంబయ్య మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావం వల్ల పుస్తక పఠనంపై ప్రజానీకానికి ఆసక్తి తగ్గడం ఆవేదనను కలిగిస్తోందన్నారు. రామాయణ, భారత, భాగవతాలతో పాటు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతో పాటు పలు రచనలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు, యువత వాటిని చదవాలని సూచించారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



మెంటాడ: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు



సంతకవిటి: డీటీ మధుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మెంటాడ: ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు వర్తింపజేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. తల్లికి వందనం పథకాన్ని వర్తింప జేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు సీఐటీయూ ఆధ్వ ర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.11, 500, సహాయకులకు రూ.7 వేలు మాత్రమే జీతం ఇస్తున్నారని, అయినా పథకాలు కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డులకు దరఖాస్తు చేస్తే ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తూ రిజెక్ట్ చేస్తున్నారని వాపోయారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

పథకాలు ఇవ్వకపోవడం తగదు

సంతకవిటి: చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వం పథకాలు ఇవ్వకపోవడం తగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ అన్నా రు. తల్లికి వందనం పథకాన్ని అంగన్‌వాడీ వర్కర్లకు వర్తింప చేయకపోవడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యక ర్తలు, ఆయాలు మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం ఉప తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన ప్రకారం నెలకు రూ.12వేలు ఆదాయంలోపు వచ్చే వారంతా సంక్షేమ పథకాలకు అర్హులేనని, కానీ అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.11,500, ఆయాలకు రూ.7 వేలు మాత్రమే గౌరవ వేతనంగా చెల్లిస్తున్నారని అన్నారు. నిబంధనల ప్రకారం పథకాలు అందాల్సి ఉన్నప్పటికీ అందడం లేదని అన్నారు. పథకాలు వర్తింపచేయ డంతో పాటు జీతాలు పెంచాలని కోరారు.

బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ.12.50 కోట్లు



మాట్లాడుతున్న మెప్మా సీఎంఎం వేణుగోపాలరావు

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని 125 డ్వాక్రా గ్రూపులకు వంద రోజుల కార్యక్రమంలో భాగంగా రూ.12.50 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలిచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు మెప్మా పట్టణ సీఎంఎం వంగపండు వేణుగోపాలరావు తెలిపారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.8.99 కోట్ల రుణాలను మంజూరు చేశామన్నారు. మహిళాకాశం కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకూ డ్వాక్రా గ్రూపుల్లో చనిపోయిన, వలస పోయిన సభ్యుల స్థానాల్లో కొత్తగా చేరిన సభ్యులను ఆన్‌లైన్ చేసేందుకు అవకాశం కలిగిందన్నారు. ఇందులో భాగంగానే ఇప్పుడు మహిళాకాశం యాప్‌లో పేర్లను ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. అలాగే పట్టణంలోని 31వార్డుల పరిధిలో 1063 మంది స్ట్రీట్ వెండర్స్ ఉన్నట్టు సర్వేలో తేలిందన్నారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని, నమోదు కాని వారు మెప్మా కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకుంటే వారిని స్ట్రీట్ వెండర్స్‌గా గుర్తిస్తామన్నారు. వారికి మరికొద్ది రోజుల్లో ఐడీ కార్డులు ఇవ్వనున్నామని సీఎంఎం తెలిపారు.

వారంలోనే బుగ్గి మాయం..!



గొర్లె సీతారాంపురం వద్ద దుమ్మురేగుతున్న బుగ్గి

బొబ్బిలి: రోడ్డు ప్యాచ్ వర్క్‌లన్నీ చేసిన పది రోజులకు కనిపించకుండా పోయాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు ప్రదానం చేసే కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి లోకేష్ వచ్చారు. ఈ సందర్భం గా గొర్లె సీతారాంపురం, పారాది, పాత బొబ్బిలి, మెట్టవలస ప్రాంతాల్లో గతుకుల రోడ్లను ప్యాచ్ వర్క్ చేయించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో హుటాహుటిన ఆర్‌అండ్‌బీ అధికారులు ప్యాచ్ వర్కులు చేయించారు. ప్రజలెంత ఇబ్బంది పడినా పట్టించుకోని కూటమి సర్కారు మంత్రి లోకేష్‌వచ్చే సరికి కుదుపుల ప్రయాణం ఆయనకు పడదని ప్యాచ్‌వర్కులు చేయించారని అప్పట్లో గుసగుసలు వినిపించాయి. మంత్రి లోకేష్ ఇక్కడికి వచ్చి వెళ్లి పది రోజులు కూడా కాలేదు. చేసిన ప్యాచ్ వర్కంతా కనుమరుగైపోయింది. రోడ్డుపై గోతుల్లో వేసిన బుగ్గి ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే కరిగిపోయింది. ఇప్పుడు ఆ బుగ్గి దుమ్ము రేగుతోంది.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం



వినియోగదారుల సమస్యలను తెలుసుకుంటున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ, తదితరులు

మెంటాడ: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. ఇద్దనవలస సబ్ స్టేషన్ వద్ద సీజీఆర్ఎఫ్ సభ్యుడు ఎస్.సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఒరిగిన, శిథిల విద్యుత్ స్తంభాలను మార్చాలని, విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని, పలుగ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యపై 21 అర్జీలు అందాయి. సమస్య లను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ ఆదేశించారు. విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 1921, వాట్సాప్ నంబర్ 94400 14734లకు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు,ఇద్దనవలస సర్పంచ్ రాయి పల్లి రామారావు, కొంపంగి సర్పంచ్ కునిబిల్లి వెంకటరమణ, విద్యుత్ శాఖ ఏఈ అనంతరావు పాల్గొన్నారు.

క్లోరినేషన్ తప్పనిసరి



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్ఈ కవిత

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్న తాగునీటి వనరుల్లో రోజూ తప్పనిసరిగా క్లోరినేషన్ చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింట కుళాయిల నిర్వహణ, తాగునీటి సమస్యలపై స్థానిక డీఈ కార్యాలయంలో డీఈ ఢిల్లీశ్వరరావు, జేఈ శ్రావణ్‌కుమార్‌తో మంగళవారం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా తాగునీటి వనరుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ జరిగేలా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు తాగునీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించాల న్నారు. పాడైన బోర్లు, కుళాయిలకు త్వరగా మరమ్మతులు చేపట్టాలని, ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. కాలువల్లో ఉన్న తాగునీటి పైపులైన్లను తొలగించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కోటలో ఎమ్మెల్యే బేబినాయనను కలిసి నియోజకవర్గంలో చేపడుతున్న వివిధ పథకాలు, పనుల గురించి వివరించారు.

'అంగన్‌వాడీ పిలుస్తోంది'

బొబ్బిలి: పట్టణంలోని 4,7,9,16,18 వార్డుల్లో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకురాలు కామేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు సెక్టార్- 2లో ఉన్న అన్ని వార్డుల్లో చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాలు, బడిలో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యకర్తలు, ఆయాలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఏడాది పాలన అంతా మోసం, దగా...



వంగర: వెన్నుపోటు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, సుదర్శనరావు

వంగర: టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా మోసం, దగా అని, ప్రజలకు ఈ ప్రభుత్వం చేసిన మేలేమీ లేదని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది అప్రజాస్వామిక పరిపాలనపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం ముద్రించిన వెన్నుపోటు పుస్తకాలను మండల కేంద్రం లో వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి ప్రభుత్వం పరిపాలన, పథకాల అమలను పక్కన పెట్టేసి చేస్తున్న అరాచకాలు, మోసాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసమని అన్నారు. ఎంపీటీసీ కనగల పద్మ, కాంబోతుల భగవతి, మగ్గూరు, రాజులగుమ్మడ సర్పంచ్‌లు పోలిరెడ్డి రమేష్, దారపురెడ్డి సింహాచలం, యలకల వాసునాయుడు, పెంకి సందీప్ కుమార్ పాల్గొన్నారు.

కాలయాపన చేస్తున్నారు..

రాజాం సిటీ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబునాయుడు కాలయాప న చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం ప్రజలను వంచించడమే పనిగా పెట్టుకుందని వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సారధి వైఎస్సార్ పార్కు సమీపంలో పార్టీ నాయకులతో కలిసి వెన్నుపోటు పుస్తకాలను మంగళ వారం ఆవిష్కరించారు. నాయకులు పాలవలస శ్యామసుందర్, దూబ గోపాలం, గోకవలస బాబూరావు, ముద్దన సత్యారావు, ఆశపు సూర్యం, సలాది సతీష్, కోలా రమ్య, రాంబాబు పాల్గొన్నారు.



రాజాం: రాజాంలో వెన్నుపోటు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్

రాజాం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాల నాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు.రాజాంలోని పార్టీ కార్యాలయంలో వెన్నుపోటు పుస్తకాలను వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ఆవి ష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని మండి పడ్డారు. వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, మాజీ సర్పంచ్ ముదిలి జనార్దన్, తదితరులు పాల్గొ న్నారు.



రాజాం సిటీ: వెన్నుపోటు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రాజాం టౌన్ వైఎస్సార్‌సీపీ నాయకులు



మెంటాడ: వెన్నుపోటు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

హామీల అమలులో విఫలం

మెంటాడ: ఎన్నికల హామీలు అమలు చేయడంలో సీఎం చంద్రబాబునాయుడు ఘోరంగా విఫలమయ్యారని, ఏడాది పాలనలో ఒకపథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఎంపీపీ రెడ్డి సన్యా సినాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు ఆధ్వర్యంలో వెన్నుపోటు పుస్తకాలను మంగళవారం ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రెడ్డి రాజప్పలనాయుడు, నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, కనిమెరక త్రినాథరావు, అచ్యుతరావు, సిరిసెట్టి నారాయణరావు, మీసాలపేట సర్పంచ్ రామునాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

రేగిడి: స్థానిక ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న ఏపీ బాలయోగి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం .సునీల్‌కుమార్ మంగళవారం వైద్యపరీక్షలు చేశారు. విద్యార్థుల్లో చాలా మందికి ఐరన్ తక్కువగా ఉన్నట్లు గుర్తించి ఐరన్ ట్యాబ్లెట్లు అందజేశారు. ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ, పీఎస్ఎన్ మూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ టి.శ్రీనివాసరావు, యోగా శిక్షకుడు ఎం.రామకృష్ణ, స్టాఫ్ నర్సు అంజలి, బంగారి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు, తదితరులు

తెర్లాం: విద్యార్థినులకు నాణ్యమైన, రుచి, శుచికరమైన భోజనం అందించాలని ఎంపీడీఓ రేగి రాంబాబు మండలంలోని కుమ్మరిపేట కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) సిబ్బందికి సూచించారు. కేజీబీవీలో మంగళవారం ఆయన తనిఖీలు చేశారు. మధ్యా హ్న భోజన వంటకాలను రుచిచూశారు. ఈసందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న యోగాంధ్ర వేడుక లకు కేజీబీవీలో 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులను తీసుకువెళ్లేందుకు సిద్ధం చేయాలని కేజీబీవీ ఎస్ఓను ఆదేశించా రు. ఆయన వెంట ఎంఈఓ త్రినాథరావు, ఈఓపీఆర్డీ నీలిమ ఉన్నారు.

2,455 రోజులుగా అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న సిద్ధార్థ

రేగిడి: మండలంలో వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త పాలూరి సిద్ధార్థ ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం మంగళవారం నాటికి 2,455 రోజులు పూర్తి చేసుకుంది. 2020లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి,రోజు తన ఇంటి వద్ద 25 మందికి మధ్యాహ్నం, రాత్రి పూట అన్నదానం చేస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ ఈఅన్నదాన కార్యక్రమం నిర్వహణకుఎంతోమంది కలెక్టర్‌లు, ఎస్పీలు, రాజకీయ నేతలు సహకరించారని, వారి ఆర్థికసాయంతోనే ఈ కార్యక్రమాన్ని ముందుకు సాగిస్తున్నానని చెప్పారు.